# కస్తూరి - కాండూరి

రాత్రి యేదో హిందీ సినిమా వచ్చిందంటే పరిగెత్తాను. ఏమిటో రంగులఫిల్ము అన్నారూ. ఆరంగుల రంగేమిటో బైటపడుతుందని ఒంటరిగానే వెళ్ళాను. హాలు మహాదూరం. స్టేషన్‌దాకా నడిచి వెళ్ళాలి. పట్నంలో సైకిల్ రిక్షాలు, జట్కాలు లేక కాదు. ఆర్థిక స్తోమత లేక. కుర్రాణ్ణి, ఇంకా ఏ ఉద్యోగంలోకి ప్రవేశించలేదు దొరక్క. అస్వతంత్రుణ్ణి. తల్లిదండ్రులమీదే ఆధరువు. సైకిల్ రిక్షామీద థియేటర్ని చేరడానికి ఎంత ధనం వెచ్చించాలో, అంతే సినిమా చూడ్డానికి అవుతుంది అటువంటప్పుడు రిక్షా అద్దె నా తరంవాయిచ్చుకోడం? కాలినడకే శరణ్యమైంది. అందుకే కాబోలు, మనిషిని ద్విపాదపశువని ఎవరో వ్రాసినట్లు జ్ఞాపకం. అసలదే ఉత్తమమైంది. పూర్వీకులు ఈ రైళ్ళూ, బస్సులు రానప్పుడు పుణ్యక్షేత్రయాత్ర లెట్లా చేశారు! అందులోకి సినిమా అనే సరికి ఎంత దూరమైనా నడిచిపోవచ్చు. యంత్రానికి మల్లే పనిచేస్తాయి కాళ్లు. పీకెట్టినా పీకెట్టినట్లుండవు. అవే ఏహరికధకో, ఏ పుణ్యకార్యాలైన పురాణ కాలక్షేపాలకో అయితే మరడక్కండి పరిస్థితి. బయల్దేరడానికి లేచేసరికి కాళ్ళు పీకు. నాలుగడుగులు వేసేసరికి ఆవులింతలు. నిద్రాకన్యక సొరెగదిలో కౌగిలింతలు రేడియోలో పురాణ కాలక్షేపం వచ్చేసరికి. శ్రోతలుస్టేషన్ మార్చేసినట్లు.

ఫిల్ము సమాప్తి. ఎలా వుందని అడగొద్దు. నే ఖర్చెట్టిన డబ్బులికి కిట్టుబాటుమాత్రం సున్న. హాలు ప్రాంగణం దాటేను. నిరుత్సాహంగా వున్నాను. ఎంత దూరమైతే హాలు కొచ్చావెూ అంత దూరమూ యిల్లు చేరాలి. వొచ్చేటప్పుడున్నంత హుషారు పోయేటప్పుడుండదు. అదీ గాక నా కెప్పుడూ వినోద కాలక్షేపాలకి ఒంటరిగా వెళ్ళే అలవాటు లేదు వెంటనెపుడూ కస్తూరి రంగడు వొస్తుండేవాడు. వాడు నాల్రోజులై ఊళ్ళోలేడు. ఏదో స్కూల్ ఫైన్లు పరీక్షకి ప్రైవేటుగా కట్టి, పరీక్షించబడ్డానికి అదేవూరొవెళ్లేడు. నేనా సుడిగాలిలోంచి ఇంతకుముందే బైటపడ్డాను. వాడు నేడోరేపో వొస్తాడని వాళ్ళమ్మ చెప్పింది.

అదృష్టం అంటే అలా వుండాలి. వీపుమీద గుద్దుపడ్డాది. ఇంక మరి అనుమానం దేనికి? వాడు సాక్షాత్తూ కస్తూరి రంగడే! పరీక్షనించి ఎప్పుడు తిరిగొచ్చాడో?

"ఇప్పుడే జనతాలో దిగాను. సినిమా చూసేపోదామని వొచ్చాను. లక్కీగా నువ్వు దొరికేవు" అన్నాడు.

సినిమా దొమ్మీగా వుండడంవల్ల కాబోలు మేం ఒకరినొకళ్ళు గుర్తు పట్టలేక పోయాం. నాకు హాల్లో ఎక్కడా అవుపించలేదు మరి?

పరీక్ష పేపర్లు ఎలా వ్రాశావని, వాచర్లు ఏమైనా ఓ చూపు చూశారా అని అన్నాను.

"ఆ విషయాలన్నీ రేపు చెప్తానురా సావకాశంగా - ప్రయాణపు బడలిక మీదున్నాను. కొంచెమైనా శాంతి వుంటుందని, ఇంటికెళ్ళడానికి వెంటనే మనస్కరించక ఇలా హాల్లో దూరాను" అన్నాడు. ముఖంలో నిరాశ అవుపిస్తూంది.

సరే, అదీ నిజమే. వాణ్ణెందు కిబ్బంది పెట్టడం. పాపం! యిప్పుడేగా ట్రెయిన్ దిగుతున్నాడు? రేప్రొద్దున్నే వొస్తానని సిద్ధంగా ఉండమన్నాను.

"తప్పకుండా!" అన్నాడు-"అందులోకి రేపు సోమవారం గదూ! మనం శివాలయానికి పోవాలి."

వీడికీ మధ్యనే దైవభక్తి జాస్తీ అయింది. బహుశ: పరీక్షలనే కాబోలు! అ తర్వాత యమునాతటి ఇసుకతిన్నెలపై విహారం ఎవరిష్టం వొచ్చినట్లు వారే. అందులోకి, పేపర్లు బైట పడిపోవడంవల్ల. మళ్ళీ పరీక్షలొస్తాయేమోనని శివాలయానికి గిరాకీ ఎక్కువైంది.

బాగానే వుందనుకున్నాను

"రిక్షాలో పోదాం!" అన్నాడు.

అదెంత కాదు? చక్కా రిక్షా ఎక్కాను. ఊర్నుంచి వొచ్చినవాడు కాబట్టి వాడిదెగ్గిర డబ్బుంటుంది.

⊗ ⊗ ⊗

శివుణ్ణి దర్శించడానికి వెళ్ళాలి కాబట్టి ముందు కస్తూరి రంగణ్ణి దర్శించాను.

"ఒచ్చావా? ఒక్కఘడీ కూచో. స్నానం చేసి వస్తాను వాడి మాటల్లో నీరసం అవుపిస్తూంది. పేపర్లు కాని తగలెట్టాడేమో! చాలామట్టుకు అందర్కీ వాచర్లు చెప్పేసేరట మరి?

"ఎలా వున్నాయి మీ సెంటరులో విశేషాలు?"

"బాగానే వున్నాయి. రాసినంతమట్టుకు రాశాను - దేవునిపై భారం వేసి."

"గాల్లో దీపం పెట్టలేదు కద?"

"లేదు లే ఓ మాదిరిగా ఏవరేజిగా వ్రాశాను మరీ! తర్వాతేమౌతుందో చెప్పలేంగా? జయాప జయాలు దైవాధీనాలు" అన్నాడు.

వీడికి నిజంగా దైవభక్తి లావైనట్లుంది. మాట్లాడితే దేవు డంటున్నాడు.

"బొత్తిగా వేదాంతం చెబుతున్నావు!" అన్నాను.

"చెప్పడమేమిటి? ఇందులో అబద్ధమేమైనా వుందా?

"ఉంద్రో లేదోఅనేది వేరే ప్రశ్న. ఇదికేవలం అదృష్టం మీద మాత్రమే ఆధారపడి వుంటుంది".

"ఆ అదృష్ట మంటేనే దేవుడు. శ్రీకృష్ణుడనే అదృష్ట దేవుడు తన చక్రాన్ని ఎలా విడిచిపెడతాడో?" అన్నాడు.

వీడికి దైవం పిచ్చి బాగా పట్టుకుంది ఈ గాలి నాక్కూడా కొంచెం తగిలేటట్టుందని. అ సంభాషణ అంతటితో ఆపేను.

రంగడు కొబ్బరికాయ, అరటిపళ్ళూ కొనడం నిజంగా ఆశ్చర్యకరమైన ఘట్టమే. దేవుడికి కానీ కూడావేసేగుణం వాడికా భగవంతుడే ప్రసాదించి లేదు.

భగవంతుడికి అభిషేకంచేయించాడు. ఇదో వింత. దేవుడికి పళ్ళెంలో తనొక అణా వెయ్యడం కాకుండా. నా చేతికో అణా యిచ్చాడు. ఇది మరో వింత. పూజారి తెచ్చిన కర్పూర హారతిని అతి అప్యాయంగా కళ్ళకద్దుకుని నాచేత అద్దింపించాడు. శఠకోపం శిరస్సుమీద కొస్తున్నప్పుడు శీర్షాన్ని అతిభక్తిగా వొంచాడు. వాడు ఎన్ని ఫీట్సుచేశాడో. అన్ని ఫీట్సూ నాచేత చేయించాడు.

తిరిగొస్తున్నప్పుడు కొందరు స్త్రీలు మా కడ్డంగా వొచ్చారు. 'వాళ్ళకు తోచిచ్చీ!' అని నన్ను ప్రక్కకు తొలగించి, వాడూ తప్పుకున్నాడు. ఇదీ వింతగానే వుంది. స్కూల్లో అడపిల్లల వెంట పడిగాపులుపడి ఈలలు వేస్తూండే కస్తూరి రంగడేనా వీడు? అంతా రసాభాసగా వుంది.

"మొత్తానికి నేను పేపర్లు తగలెట్టానుస్మీ!" అన్నాడు. ఇప్పుడు దార్లో కొస్తున్నాడు.

"ఏం అలాగ?"

"లెక్కల పేపరే కొంచెం డౌటు" అన్నాడు

"బాధ లేదురా - పాసై పోతావు" అన్నాను.

"లేదు. బాగానే పాడైంది."

"నే చెప్పేగా పాసవుతావని? నా ధైర్యవచనాలు విని నిద్రపో!" అన్నాను.

"ఏమిటో అన్నిటికీ నీ ప్రోత్సాహమే కనిపిస్తూంది. ఏదో నామీద అభిమానం వుండబట్టీ" - నసిగాడు.

"ప్రోత్సాహాని కేముంది రా! నీ కిప్పుడున్నవి రెండు....."

"నాకుతెలుసు. నీ ప్రోత్సాహమూ, దేవుడి దయను"

"ఔను."

"సరే-ఏమౌతుందో చూస్తాంగా-ఆ రెండూ ఎట్లా వున్నాయో? నీ ప్రోత్సాహంవల్లే నాకు సగంకడుపు నిండుతూందనుకో!" అని కొంచెం జాలిగా ప్రాధేయపడ్డాడు.

"లేదు. నువ్వు నిబ్బరంగా వుండు. నువ్వు నెగ్గుతావ్."

ఎవరి మానాన్ని వారు పోయాం. నా మాటలు విన్నాక వాడిమనస్తత్త్వం ఎలావుందో! ఫలితాలు ప్రకటించిన సాయంత్రమే వాడింటికి వెళ్ళాను.

"కస్తూరీ వాడున్నాడా?"

"లేదు నాయనా! పరీక్ష పాసై సినిమా కెళ్ళాడు" అంది వాళ్ళమ్మ.

ఇహ నా ఆనందం వేరే చెప్పాలా? రాకెట్ మీద చంద్రమండలంలోకి ఎగిరినంతయ్యాను. వాణ్ణి ఆ రాత్రి కలియలేక పోయాను.

ఆ రాత్రి నాకు సరిగ్గా నిద్దరపట్టదని అందరికీ తెలిసినవిషయమే. వాడింటికెళ్లాను. లోనికి చొరబోయాను.

"దేవుడి దయరా అన్నయ్యా ఇది" అంది వాడి చెల్లి.

"ఆగుడ్డ దేవుడు పోనిస్తూ!" అన్నాడు. వీడి తస్సాదియ్యా! అపుడే వీడికింత గర్వం? ఇంతలోకే గుడ్డుదేవుడా? నేనూ అలాఅంటే, నాకూ అలాంటి సమాధానమే పుడుతుందని ఆ ప్రశ్నమాత్రం అడగలేదు.

ఏవిధంగానైనా వాడు కృతార్థుడైనందుకు వాడి చేత మరి మెప్పింపబడొద్దా? అంచేత ఆ వేళ ధైర్యవచనాలు జ్ఞప్తికొచ్చి- "పోనీ దేవుడంటే లేకపోవచ్చు. నా ప్రోత్సాహం లేదంటావా లేదా?" అన్నాను.

ఇందుకు కస్తూరి రంగడు;

"నీ ప్రోత్సాహమేమిట్రా-లక్ష్మింపతిగాడివి! కష్టపడీ చదవబట్టీ ప్యాసయ్యాను" అన్నాడు.

⊗ ⊗ ⊗

1956

**ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక**